ద్వారపూడిలో భూగర్భ జలాల కలుషితం

పరిశ్రమల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - మండపేట : అసలే భూగర్భ జలాలు అడుగంటి, త్రాగు, సాగు నీరు అందక ప్రజలు ఇబ్బంది పడుతుంటే కొంతమంది స్వార్థ ప్రయోజనాల వల్ల అరకొరగా ఉన్న భూగర్భ జలాలు సైతం కలుషితంగా మారి ప్రజల ప్రాణాలను హరించి వేస్తున్నాయని వైస్ ఎంపీపీ అడబాల బాబ్జి అన్నారు. మండలంలోని ద్వారపూడిలో పరిశ్రమల వ్యర్థాల వల్ల భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోయాయన్నారు. స్థానికంగా ఉన్న రామలింగేశ్వర పేపరు మిల్లు యాజమాన్యం వాటి వ్యర్థాలు భూమిలోపలికి చొప్పించి కప్పెడుతున్నారని ఆరోపించారు. పేపర్ మిల్లు లోపల సుమారు 300 అడుగుల లోతు బోర్లు తవ్వి కెమికల్ వాటర్‌ను అందులోకి విడిచి పెడుతున్నారని అన్నారు. ఇలా భూమిలోపలికి వదిలేసిన కెమికల్ వాటర్ భూగర్భ జలాల్లో చేరి కలుషితం చేస్తున్నాయన్నారు. దీంతో గ్రామంలోని ప్రజలు కిడ్నీ సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొంత మంది మరణించారన్నారు. దీనంతటికీ రామలింగేశ్వర పేపరు మిల్లు నిర్వాహకులే కారణమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆయన గురువారం మండల పరిషత్ అధికారి ఐదం రాజుకు వినతి పత్రం అందజేశారు. గ్రామంలో జరుగుతున్న పరిస్థితిని వివరించారు. ఇక్కడి జలాలను ల్యాబ్ టెస్టులకు పంపాలన్నారు. ద్వారపూడి భూగర్భ జలాలు పరిరక్షణ కోసం జిల్లా కలెక్టరుకు కూడా ఫిర్యాదు చేయనున్నట్టు బాబ్జి మీడియాకు తెలిపారు.

రహదారి భద్రతా వారోత్సవాలు

విశాలాంధ్ర - కాకినాడ : రోడ్డు ప్రమాదాలను నివారించే క్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రహదారి భద్రతా వారోత్సవాలు కాకినాడ జిల్లా ఎస్పీ ఎం. రవీంద్రనాథ్ బాబు ఆదేశాల మేరకు కాకినాడ ట్రాఫిక్ డీఎస్పీ ఎం. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆటో యూనియన్ సభ్యులు, ట్రాఫిక్ సిబ్బందితో గురువారం బాలాజీ చెరువు నుండి జడ్పీ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో నిత్యం ప్రమాదాలు ఏ విధంగా జరుగుతున్నాయనే విషయం పైన డీఎస్పీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ హెల్మెట్ అవేర్నెస్ గురించి, సీట్ బెల్ట్ గురించి, ఆటో ఓవర్ లోడింగ్ గురించి, ఓవర్ స్పీడ్ గురించి తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ 2 సిఐ, ట్రాఫిక్ 1 & 2 ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

గండేపల్లి మండలంలో పలుచోట్ల దొంగతనాలు

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి గ్రామంతో పాటు మండలంలోని మల్లేపల్లి గ్రామంలో వరుస దొంగతనాలు జరిగాయి. గండేపల్లి గ్రామానికి చెందిన మామిడిపాక కళ్యాణ్ శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో కలిసి భద్రాచలం వెళ్ళగా అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని దొంగలు అతని ఇంటిలోకి అక్రమంగా ప్రవేశించి బీరువా తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న సుమారు ఐదున్నర కేజీల వెండి వస్తువు, నాలుగు గ్రాముల బంగారు వస్తువులను, 30 వేల రూపాయలు నగదు దొంగలించారు. అలాగే మల్లేపల్లి గ్రామానికి చెందిన అడబాల కంచి కామాక్షి ఇంట్లోకి తెలియని వ్యక్తులు ప్రవేశించి తాళాలు పగలగొట్టి పదివేల రూపాయల నగదు, అరకాసు శతమానాలు దొంగిలించినట్లు పోలీసులు తెలిపారు. గండేపల్లి గ్రామానికి చెందిన మామిడిపాక కళ్యాణ శ్రీనివాస్ 1,40,000, మల్లేపల్లి గ్రామానికి చెందిన అడబాల కంచి కామాక్షి 30,000 రూపాయలు ఉంటుందని పోలీసులు తెలిపారు. నేర స్థలాన్ని క్లూస్ టీమ్ వారు పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గండేపల్లి ఎస్సై గణేష్ కుమార్ తెలిపారు.

కార్తికేయ ఆసుపత్రిలో అరుదైన మోకాలి శస్త్ర చికిత్స

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట పరిధిలోని కార్తికేయ ఆసుపత్రిలో అరుదైన అత్యాధునిక మోకాలి శస్త్రచికిత్స (మినస్కస్ రిపేర్) చేసి విజయవంతమైనట్లు డాక్టర్ దీపక్ తెలిపారు. కర్ణాటక రాష్ట్రం మాండవి జిల్లాకు చెందిన డివివి సత్యనారాయణ రోడ్డు ప్రమాదంలో రెండు సంవత్సరాల క్రితం మోకాలికి తీవ్ర గాయమై భరించలేనంత నొప్పితో భాదపడుతూ చాలా హాస్పిటల్స్ తిరిగి మరెందరో వైద్యులను సంప్రదించినా మోకాలి నొప్పికి ఉపశమనం లభించలేదు. తన బంధువుల ద్వారా కార్తికేయ హాస్పిటల్స్ డాక్టర్ దీపక్‌ను కలవడంతో క్లినికల్‌గా పరీక్షించి అత్యవసరంగా మోకాలి శస్త్రచికిత్స సిఫార్సు చేసారు. డాక్టర్ దీపక్ ఆధ్వర్యంలో డాక్టర్ గుణశేఖర్, డాక్టర్ అవినాష్ సహకారంతో ఈ శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించామన్నారు. కార్తికేయ హాస్పిటల్ చీఫ్ డాక్టర్ అవినాష్ మాట్లాడుతూ తమ హాస్పిటల్‌లో అత్యాధునిక శస్త్ర చికిత్స పరికరములు ఏర్పాటు చేసి ఎటువంటి జబ్బుకైనా మా వద్ద 24 & 7 చికిత్సలు అందుబాటులో 0వున్నాయని తెలిపారు. హాస్పిటల్ సిఇఓ కె. వెంకటరమణ మాట్లా డుతూ గ్రామీణ ప్రాంతాలకు అందుబాటులో అత్యాధునిక వసతులతో హాస్పిటల్‌లో జరిగిన చికిత్స విజయవంతమైనందుకు సంతోషం వ్యక్తం చేశారు. చికిత్స అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ తాను మోకాలి నొప్పితో ఎంతో బాధపడే వాడినని చికిత్స చేసిన వెంటనే నడవగలుగుతున్నానని, నొప్పి లేదని ఆనందం వ్యక్తం చేశారు.

శాంతి భద్రతలపై పోలీసులతో ఎమ్మెల్యే గోరంట్ల సమీక్ష

విశాలాంధ్ర - రాజమండ్రి: రాజమండ్రిలో శాంతి భద్రతలు రోజురోజుకు క్షీణిస్తున్నాయని, నగరవాసులు రాత్రి వేళ రోడ్లపై తిరగడానికి భయపడుతున్నారని రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి గారు పేర్కొన్నారు. గురువారం ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లిన గోరంట్ల పోలీస్ అధికారులతో నగరంలోని శాంతిభద్రతలపై సమీక్షించారు.రోజు రోజుకు పెరుగుతున్న నేరాలపై సరైన నియంత్రణ లేకపోవడం, నగరంలో బ్లేడ్ బ్యాచ్ ఆగడాలు రోజురోజుకు ఎక్కువ అయిపోయాయని, వీరిపై కఠినమైన కేసులు పెట్టి న్యాయస్థానం ద్వారా వారికి శిక్షపడేలా చేయాలని,ఇటీవల ధవళేశ్వరం గ్రామంలో బ్లేడ్ బ్యాచ్ వల్ల మృతి చెందిన కేసును త్వరితగతిన విచారణ వేగవంతం చేసి దోషులను న్యాయస్థానం వద్ద హాజరు పరిచి వారికి శిక్ష పడేలా చేయాలని సూచించారు.

మరింత వేగంగా ప్రజా సమస్యల పరిష్కారం

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : ప్రజల సమస్యలు, వారి ఇబ్బందులు స్వయంగా తెలుసుకుని వాటిని అక్కడికక్కడే సంబంధిత అధికారుల ద్వారా పరిష్కరించేందుకు 'గుడ్ మార్నింగ్ రాజమండ్రి' ఎంతగానో ఉపయోగపడుతోందని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. గురువారం నగరంలోని 40 వ వార్డు లక్ష్మీ గణపతి గుడి, ఆర్యాపురం మూలగొయ్యి, చింతాలమ్మ ఘాట్ రోడ్డు వద్ద నుండి వీధి వీధికీ వెళ్ళి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మీడియాతో మాట్లాడుతూ 'గుడ్ మార్నింగ్ రాజమండ్రి' ప్రతి రోజూ జరిగే కార్యక్రమమని, ఏ రోజు ఎక్కడ పర్యటిస్తామనేది చెప్పకుండా కొద్ది నిమిషాల ముందు అధికారులకు చెప్పి ఆకస్మికంగా పర్యటిస్తున్నామని, ప్రజల నుండి మంచి స్పందన, ఆదరణ లభిస్తోందని ఎంపీ భరత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, వార్డు ఇన్‌చార్జి దుంగా మంగ, దుంగా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

యోగి వేమన జీవితం ఆదర్శవంతం

కాకినాడ ఎంపీ వంగా గీత

విశాలాంధ్ర - కాకినాడ : ప్రజా కవి, సంఘ సంస్కర్త యోగి వేమన జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శవంతమైందని కాకినాడ ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. గురువారం యోగి వేమన జయంతి సందర్భంగా కలెక్టరేట్ కోర్టుహాల్‌లో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీ వంగా గీత, కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్వో కె.శ్రీధర్ రెడ్డి, కాకినాడ అర్బన్ శాసనసభ్యులు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కుడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, కాకినాడ నగరపాలక సంస్థ మాజీ మేయర్ సుంకర శివప్రసన్న తదితరులు పాల్గొని వేమన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. సామాజిక చైతన్యంతో నిండిన వేమన పద్యాల సాహిత్య ఔన్నత్యాన్ని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సీపీ బ్రౌన్ ద్వారా వేమన పద్యాలు పుస్తకం రూపంలో తొలిసారిగా వెలుగులోకి వచ్చాయని తెలిపారు. సమాజంలోని వివిధ సమస్యలను భిన్న కోణాల్లో స్పృశించి.. వేమన తన పద్యాల్లో విలువలను చొప్పించారని పేర్కొన్నారు. కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ నేటి తరానికి యోగి వేమన జీవితం, శతక సాహిత్యం గురించి అవగాహన పెంపొందించేలా ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సరళమైన భాషలో, చక్కటి ఉదాహరణలతో వేమన పద్యాలు ప్రతి ఒక్కరి హృదయాలను హత్తుకుంటాయని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి జీఎస్ఎస్ శ్రీనివాస్, వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని, రచనలను వక్రీకరిస్తే సహించేది లేదు

విశాలాంధ్ర - రాజోలు : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని, రచనలను వక్రీకరిస్తే సహించేది లేదని మలికిపురం దళిత సంఘాలు సామాజిక హక్కుల వేదిక మహాసేన రాజేష్ ను హెచ్చరించారు. గురువారం మలికిపురం పూలే అంబేద్కర్ భవన్లో సామాజిక హక్కుల వేదిక కన్వీనర్ దేవ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ రాజ్యాంగం వ్రాసి అర్ధ శతాబ్దం అయ్యిందని, కులవివక్ష 90 శాతం నిర్మూలించబడిందని రాజేష్ చెప్పడం హాస్యాస్పదం అన్నారు. ఈ వ్యాఖ్యలు ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగాఉన్నాయని, సమాజానికి తప్పుడు సంకేతాలు పంపడం సరైనది కాదని ఈ సమావేశం రాజేష్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించింది. తక్షణమే సమాజానికి క్షమాపణ చెప్పాలని లేని పక్షంలో రాజేష్‌ను ఎక్కడా అడుగుపెట్టనీయమని సమావేశంలో మాట్లాడిన వక్తలు హెచ్చరించారు. మతోన్మాదులు, కులోన్మాదుల చేతిలో కీలుబొమ్మగా మారిన రాజేష్ దళితుల హక్కులను కాలరాయడానికి కంకణం కట్టుకున్నాడని విమర్శించారు. దళిత సంఘాలను, అంబేద్కరిస్టులను అసభ్యంగా మాట్లాడుతున్న మహాసేన రాజేష్, అతని అనుచరులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో బహుజన సామాన్య సమాఖ్య అధ్యక్షులు గడ్డం తులసి భాస్కరరావు, దళిత సంఘాల నాయకులు సరెళ్ళ విజయప్రసాద్, చింతా రాజబాబు, గెడ్డం. పిలిప్ రాజు, రాపాక మహేష్, తాడి. సహదేవ్, పమ్మి. రత్న రాజు, తాడి రవీంద్ర, నక్క సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

వివాద రహిత భూముల అందజేత లక్ష్యం

విశాలాంధ్ర - అమలాపురం : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వైయస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష పథకం సర్వే ద్వారా గ్రామాలలో భూ వివాదాలను పరిష్కరించడంతో పాటుగా భావితరాలకు వివాద రహిత భూములను అందించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి అమరావతి నుండి వీడియో కాన్ఫరెన్స్ వివిధ జిల్లాల కలెక్టర్లతో నిర్వహించి రీ సర్వే, జాతీయ రహదారులకు భూసేకరణ, నివేశన స్థలాలు పట్టాలు జారీ, స్పందన గ్రీవెన్స్, వ్యవసాయ, ఉద్యాన పశుసంవర్ధక గృహనిర్మాణాలు గడపగడపకు మన ప్రభుత్వం, మైక్రో ఇరిగేషన్, జగనన్న పాల వెల్లువ, తదితర అంశాల పురోగతిపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రిసర్వేను అన్ని దశలలో వేగవంతం చేసి రెవెన్యూ రికార్డులు స్వచ్ఛకరిస్తూ వెబ్ లండ్లో వివరాలు అప్లోడ్ చేయాలని ఆదేశించారు. స్పందన గ్రీవెన్స్ పెండింగ్ ఆస్కారం లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు, రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో ఈ క్రాప్ బుకింగ్ ఈ కేవైసీ పూర్తి చేయాలని పిఎం కిసాన్ పీకేవైసీ కూడా పూర్తి చేయాలని ఆదేశించారు. మండలాల వారీగా నాట్లు వేసిన వెంటనే ఈక్రాప్ బుకింగ్ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, డిఆర్ఓ సిహెచ్ సత్తి బాబు, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు రక్షణ చట్టం చేయాలి

విశాలాంధ్ర - పిఠాపురం : మహిళా న్యాయవాదిపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. గురువారం న్యాయవాదులు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. న్యాయవాదులకు రక్షణ కల్పించి, రక్షణ చట్టం చేయాలని, దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం. రాజారావు మాట్లాడుతూ కాకినాడ న్యాయవాది అన్నపూర్ణమ, ఆమె కుటుంబ సభ్యులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారులు, న్యాయస్థానాల ద్వారా పరిష్కరించుకోవాలి కానీ భౌతిక దాడులకు దిగడం, తీవ్ర గాయాలు పాలు చేయడం, భయభ్రాంతులకు గురి చేయడం సరైన విధానం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా కార్యదర్శి జివిఎస్ భాస్కరాచార్యులు మాట్లాడుతూ మహిళా న్యాయవాదిపై దాడికి పాల్పడిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇటీవల కాలంలో న్యాయవాదులపై దాడులు పెరిగాయన్నారు. న్యాయవాదులపై దాడులు అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని అన్నారు. న్యాయవాదులకు రక్షణ చట్టం చేసి అమలు చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎస్ఎం అలీ, కార్యదర్శి ముమ్మిడి రామకృష్ణ న్యాయవాదులు బిఎల్ దొర, గుబ్బల సురేష్ బాబు, కె విజయ్ కుమార్, కొంజర్ల అప్పారావు, ఎం సత్యవతి, కృష్ణవేణి, గౌతు రాజా, జి రేగన్ రాజు వైవిఎస్ మూర్తి, పి రాజు, సత్యనారాయణ, ఉదయ్ భాస్కర్, సురవరం వెంకటేశ్వరరావు, ఏవి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాగసాని తిప్పకు రక్షిత మంచినీరు

విశాలాంధ్ర - కాట్రేనికోన : కాట్రేనికోన మండలం మగసాని తిప్ప గ్రామానికి కార్పొరేట్ సామాజిక నిధులతో సుమారు 8.5 కిలోమీటర్ల మేర మడ అడవుల్లో ద్వారా పైప్ లైన్ వేసి ట్యాప్‌ల ద్వారా త్రాగునీటి సరఫరాను ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. గురువారం స్థానిక శాసనసభ్యులు పొన్నాడ వెంకట సతీష్ కుమార్, ఓఎన్జిసి ప్రతినిధులు జిల్లా కలెక్టర్ ట్యాప్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సుమారు 300 మంది నివసిస్తున్న మగసాని తిప్ప ఐలాండ్ ప్రాంతంలో మంచినీరు అందక ఇబ్బంది పడుతున్న ప్రజలు దాహార్తిని తీర్చేందుకు సిఎస్ఆర్ నిధులతో వారి దాహార్తిని తీర్చేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. జిల్లా చరిత్రలో ఇదొక సువర్ణ అధ్యయమని ఎంతో కాలంగా త్రాగునీటి కోసం ఇబ్బంది పడుతున్న ఈ మారుమూల గ్రామస్తులకు దాహార్తిని తీర్చడం సంతోషంగా ఉందన్నారు. ఇదే ప్రాంతంలో జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి కుళ్ళాయి కనెక్షన్ ఇచ్చేందుకు 96 లక్షల రూపాయలతో ప్రాజెక్టు మంజూరు అయ్యిందని త్వరలో ఓహెచ్ఎస్ఆర్, సంపు నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ సిహెచ్ ఎన్వి కృష్ణారెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న ముగ్గురి అరెస్టు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలోనీ ఉచ్చిలి గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారని ఆత్రేయపురం పోలీసు స్టేషన్‌కి సమాచారం రావడంతో సుధాకర్ ఎస్సై తన స్టేషన్ సిబ్బందితో పేకాట ఆడుతున్న శిబిరంపై మెరుపు దాడి చేయగా పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్దనుండి రూ.3540 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సిహెచ్ సుధాకర్ తెలిపారు.

బీజేపీ ప్రైవేటీకరణ విధానాలకు స్వస్తి పలుకుదాం

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు

విశాలాంధ్ర - కాకినాడ : ఈ నెల 23, 24 తేదీల్లో రెవెన్యూ డివిజన్ కార్యాలయాల వద్ద సిపిఐ, ఏఐటియుసి ఆధ్వర్యంలో జరిగే దీక్షల వాల్ పోస్టర్ను స్థానిక రెవెన్యూ కాలనీ పిఆర్ భవన్లో గురువారం ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా విచ్చేసిన సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు మాట్లాడుతూ బిజెపి ప్రైవేటీకరణ విధానాలకు స్వస్తి పలికి, విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకుందాం అన్నారు. జనవరి 27న విశాఖలో జరిగే కార్మిక మహాగర్జనకు మద్దతుగా 23,24 తేదీల్లో రెవెన్యూ డివిజనల్ ఆఫీసుల వద్ద జరిగే దీక్షను జయప్రదం చేయాలని కోరారు. 25వ తేదీన జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిరసనలు జరుగుతాయని ఈ నిరసనలకు పార్టీ ప్రజాసంఘాలు ప్రజలు రావాలని ఆయన పిలుపునిచ్చారు. 32 మంది ప్రజల బలిదానాలతో, 26 వేల మంది రైతుల త్యాగాలతో 67 మంది శాసనసభ్యులు, ఏడుగురు పార్లమెంటు సభ్యులు రాజీనామాలతో ఆంధ్రుల హక్కు విశాఖ హుక్కు సాధించారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మద్దతు లేకపోయినా సొంత గనులు కేటాయించక పోయినా నిర్విఘ్నంగా నడుస్తూ నేడు 35 వేల మంది పర్మనెంటు, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ప్రత్యక్షంగా, లక్షమందికి పరోక్షంగా ఉపాధి కల్పిస్తోందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బోడకొండ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ఏకైక భారీ పరిశ్రమ తెలుగు ప్రజల భావోద్వేగాలు, బలిదానాలతో నిర్మితమైన ఉక్కు ఉత్పత్తులో దేశంలోనే మన్నికైన న్యాయమైన ఫ్యాక్టరీని ప్రభుత్వ రంగంలోనే నిలబెట్టుకోవడానికి రెండు సంవత్సరాలుగా విశాఖ స్టీల్ కార్మికులు నిర్వాసితులు, రాష్ట్రంలోని అన్ని తరగతులు, విభాగాల ప్రజల్లో, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఉద్యమాలు పోరాటాలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వానికి సిగ్గు ఎగ్గు లేదని అన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ సిపిఐ-ఏఐటియుసి ఆధ్వర్యంలో ఈనెల 23, 24 తేదీల్లో అన్ని రెవెన్యూ డివిజనల్ కేంద్రాల్లో సామూహిక దీక్షల కొనసాగుతాయన్నారు. 25న జిల్లా కలెక్టరేట్ ఆఫీసులు ఎదుట పెద్ద ఎత్తున నిరసన ధర్నా నిర్వహిస్తామని, ఈ నిరసన ధర్నాకు కార్మికులు, ఇతర ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు పాల్గొనాలని ప్రసాద్ అన్నారు. ఏఐటీయూసీ సీనియర్ నాయకులు పెద్దిరెడ్డి సత్యనారాయణ (పిఎస్), సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లోవరత్నం, సిపిఐ నాయకులూ అప్పలరాజు, శాఖ రామకృష్ణ, ఏఐటీయూసీ నాయకులు పప్పు ఆదినారాయణ, బొబ్బిలి శ్రీనివాస్ రావు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

యోగివేమన జయంతి

విశాలాంధ్ర - కాకినాడ : ప్రజా కవి, సంఘసంస్కర్త యోగివేమన జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కే రమేష్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు యోగివేమన జయంతిని స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. కమిషనర్ రమేష్, ఎడిసి సిహెచ్ నాగ నరసింహారావుతో పాటు పలువురు అధికారులు ఉద్యోగులు, యోగివేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ రమేష్ మాట్లాడుతూ సమాజంలోని రుగ్మతలపై తన కవితల ద్వారా మేల్కొల్పిన యోగివేమన జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయ మన్నారు. ఎంతో ప్రాచుర్యం పొందిన వేమన శతకాలను మననం చేసుకునే లక్ష్యంతోనే ప్రభుత్వం వేమన జయంతిని అధికారిక కార్యక్రమంగా నిర్వహిస్తోందన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, సమాజాన్ని మేల్కొల్పిన చైతన్యవంతులను మననం చేసుకునేలా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్య కుమారి, కార్యదర్శి ఎం ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, డిఇ వెంకట్రావు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ సిరిల్, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వి చరణ్, ఏసీపి నాగశాస్త్రులు పలువురు అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

రసాయన అవశేషాలు లేని పంట ఉత్పత్తులు పొలంబడి ఉద్దేశం

విశాలాంధ్ర - గోపాలపురం : వ్యవసాయంలో అవసరం మేర ఎరువులు,పురుగు మందులు వినియోగిస్తూ రసాయన అవశేషాలు లేని పంట ఉత్పత్తులను పొందడమే పొలంబడి ముఖ్య ఉద్దేశం అని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ బోస్ బాబు తెలిపారు. బుధవారం మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో రైతులకు పంటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నిర్దేశించి బోసు బాబు మాట్లాడుతూ పొలంబడి ఉద్దేశం దానివల్ల రైతులకు కలిగేటటువంటి లాభాలను క్షుణ్ణంగా విసిదీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏ డి ఏ రంగారావు,కొవ్వూరు సహాయ వ్యవసాయ సంచాలకులు పి.చంద్రశేఖర్ ఏవోలు బి. రాజారావు, వెంకన్నబాబు, రైతులు, వి.ఏ.ఏ.లు పాల్గొన్నారు.

రిపబ్లిక్‌డేపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర - దేవరపల్లి : యర్నగూడెం జడ్.పి. హైస్కూల్‌లో రాబోవు రిపబ్లిక్ డే ఉత్సవాలకు పురస్కరించుకుని పార్డ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ గురువారం విద్యార్థులకు "భారత రాజ్యాంగం-ప్రజాస్వామ్యం" అనే అంశంపై విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించింది. ఈ సందర్భంగా రాజ్యాంగ రచన కోసం జరిగిన కృషిని గురించి, రాజ్యాంగం కల్పించిన హక్కుల గురించి సామాజిక విశ్లేషకులు సుంకవల్లి సత్తిరాజు సుదీర్ఘ విశ్లేషణతో విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుని కె.వాసవి మాట్లాడుతూ హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తించి ప్రవర్తించాలని సూచించారు. వ్యాయామ ఉపాధ్యాయులు జగదీష్ రాజు మాట్లాడుతూ, విద్యార్థులు స్వయం సాధనతో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్డ్ ఇండియా ప్రతినిధి సోమిశెట్టి వెంకట్రావు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర - కొవ్వూరు : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 79 వ రోజు కొవ్వూరు టౌన్ లో హోం శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత పర్యటించారు. కొవ్వూరు పట్టణం లోని 3వ వార్డులో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని హోంమంత్రి స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఒక్కో కుటుంబానికి నాలుగయిదు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఆమె స్పష్టంచేశారు. గత ప్రభుత్వ హయాంలో పెన్షన్ కోసం వృద్ధలు అనేక అవస్థలు పడేవారని గుర్తు చేశారు. సీఎం జగన్ పాలనలో సచివాలయ సిబ్బంది ద్వారా నేరుగా ఇంటి వద్దకే పెన్షన్, రేషన్ లాంటివి అందిస్తున్నారని హోంమంత్రి తానేటి వనిత కొనియాడారు.

ప్రజా కవి వేమన

విశాలాంధ్ర - అనపర్తి : పామరులకు కూడా అర్థమయ్యే రీతిలో పద్యాలు చెప్పి ప్రజల్ని మెప్పించిన ప్రజా కవి యోగి వేమన గొప్ప సంఘసంస్కర్త అని ప్రధానోపాధ్యాయులు మణికుమార్ అన్నారు. గురువారం యోగివేమన జయంతి సందర్భంగా కొప్పవరం ప్రాథమిక పాఠశాలలో వేమన జయంతి సందర్భంగా చిత్రపటానికి పుష్పాలు సమర్పించి ఘనంగా నిర్వహించారు. అనంతరం పాఠశాల తెలుగు పండితులు దేవరకొండ సుబ్బారావు మాట్లాడుతూ సమాజంలోని అన్ని సమస్యలు భిన్న కోణాల్లోంచి దర్శించి ఆ దర్శన వైశిష్ట్యాన్ని వేమన తన పద్యాలలో ప్రదర్శించారని అన్నారు.అనంతరం విద్యార్థులకు వేమన విశిష్టత, గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు.

మేథ్స్ ఒలింపియాడ్‌లో సత్తా చాటిన శ్రీ మహతి

విశాలాంధ్ర - సీతానగరం: మేథ్స్ ఒలింపియాడ్‌లో శ్రీ మహితి సత్తా చాటింది. శ్రీ మహతి విద్యార్థులు బంగారు పతకాలు సాధించారని కరస్పాండెంట్ ఎ. శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ విలేకరులతో మాట్లా డుతూ దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ మేథ్స్ ఒలింపియాడ్ పరీక్షలో జోనల్ స్థాయిలో కాటవరం గ్రామంలో గల శ్రీ మహతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థులు ఒకటవ తరగతి నుండి 10వ తరగతి వరకు మొత్తం 45 మంది విద్యార్థులు బంగారు పతకాలు సాధించగా 32 మంది విద్యార్థులు లెవెల్ 2 పరీక్షకు ఎంపిక అయ్యారని ఐఐటి అకాడమిక్ డైరెక్టర్ ఎ. రాం ప్రసాద్ విలేకర్ల సమావేశంలో తెలిపారని అన్నారు. విజయం సాధించిన విద్యార్థులు, అందుకు కారణమైన ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

మాజీ ఎమ్మెల్యే బుచ్చిరాజుకు కాపునాడు వార్నింగ్

విశాలాంధ్ర - అమలాపురం : డబ్బు కోసం కాపులు అమ్ముడైపోయారని కాపు సామాజిక వర్గాన్ని కించపరిచిన రాంగోపాల్ వర్మ తన ఉనికిని కాపాడుకోవడం కోసం, వివాదాస్పద వ్యాఖ్యలు ద్వారా, వికృత చేష్టలు ద్వారా, తాను తీసే సినిమాలు ద్వారా సామాజిక అంతరాలను, అశాంతిని పెంచి, కులాల కుమ్ములాటలు ప్రోత్సహించే ఓ మానసిక రోగి లాంటి ఆర్జీవి సాక్షాత్ సోషల్ మీడియా ట్విట్టర్ వేదికగా విమర్శించిన వాడిని, పచ్చని కోనసీమకి ఆహ్వానించి, ఆతిథ్యానిచ్చిన బుచ్చిరాజు ఇక్కడి ఇతర సామాజిక వర్గాల ప్రజలకు ఏమి చెప్పదలచుకున్నారని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాపునాడు జిల్లా అధ్యక్షులు అబ్బిరెడ్డి సురేష్ ఒక ప్రకటనలో ప్రశ్నించారు. సమాజానికి చీడపురుగు లాంటి రాంగోపాల్ వర్మ ద్వారా ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే బుచ్చిరాజు ఏదైనా రాజకీయ మైలేజీ పెంచుకోదలచారా లేదా కులాల అంతరాలను ప్రోత్సాహించదలచారా అని సురేష్ తూర్పారబట్టారు.

వార్డు సభ్యుడు రాజీనామా

విశాలాంధ్ర - రావులపాలెం : రావులపాలెం గ్రామ పంచాయతీ 15వ వార్డు సభ్యుడు సానబోయిన శ్రీనివాస్ బాబు తన పదవికి రాజీనామా చేసారు. గురువారం రావులపాలెం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జి.రాజేంద్రప్రసాద్‌కు తన రాజీనామా పత్రాన్ని సమర్పించారు. తన వ్యక్తిగత కారణాల రీత్యా తన పదవికి రాజీనామా చేసానని, తన రాజీనామాను ఆమోదించాలని కోరారు.

వేములూరు మాజీ సర్పంచ్ ఎలమేయమ్మ మృతి

విశాలాంధ్ర - కొవ్వూరు : కోవూరు మండలం వేములూరు గ్రామ మాజీ సర్పంచ్ మరపట్ల ఎలివేయమ్మ గురువారం మృతి చెందారు. ఈమెకు, తొమ్మిది మంది సంతానం. ఈమె కుమారుడు మరపట్ల చక్రవర్తి నిర్మాత, తెలుగుదేశం పార్టీ కొవ్వూరు నియోజకవర్గ తెదేపా సీనియర్ నాయకులు. ఈమె 2013 నుంచి 5 సంవత్సరాల గ్రామ సర్పంచ్‌గా పనిచేసి గ్రామ అభివృద్ధికి కృషి చేశారు. ఈ సందర్భంగా పలువురు రాజకీయ నాయకులు ప్రముఖులు ఆమె పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్య

విశాలాంధ్ర - కొత్తపేట : మనస్థాపానికి గురై వివాహిత ఉరివేసుకుని చనిపోయినట్లు కొత్తపేట అదనపు ఎస్సై డి. శశాంక తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేటకు చెందిన యేలిశెట్టి సత్యసాయి రమేష్ తన భార్య లోవసీత సుందరి, ఇద్దరు కుమార్తెలు, అత్తగారైన బందారు అనంతలక్ష్మితో స్థానిక కమ్మిరెడ్డిపాలెంలో నివాసముంటున్నారు. గురువారం తన పిల్లలను స్కూలుకి పంపించే క్రమంలో పిల్లలను కోపగించడంతో భర్త వచ్చి మందలించాడు. అనంతరం తన పిల్లలను స్కూలుకి తీసుకుని వెళ్లి ఇంటికి వచ్చేసరికి తన భార్య ఏదంటూ తన అత్తని అడగగా తలనొప్పి వస్తుంది, కాసేపు పడుకుంటానని చెప్పి తన పడక గదిలోకి వెళ్ళిందని చెప్పడంతో భర్త వెళ్లి చూడగా లోవ సీత సుందరి(34)పడక గదిలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. వెంటనే తన భర్త స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ సంఘటనపై సమాచారం రావడంతో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పంచనామా నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై మృతురాలి తల్లి అనంతలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తులు చేస్తున్నట్టు అదనపు ఎస్సై డి.శశాంక తెలిపారు.

వేమన శతకాలు కీర్తిని పొందాయి

విశాలాంధ్ర - గణపవరం: తెలుగు కవి యోగి వేమన రచించిన శతకాలు, పద్యాలు సామాన్య ప్రజలకు కూడా అర్థమయ్యే భాషలో చెప్పి ప్రజల్ని మెప్పించి ఆ రచనలు కీర్తిని తెచ్చిపెట్టాయని పుర ప్రముఖులు పిప్పర గ్రామానికి చెందిన ఇందుకూరి వెంకట నరసింహారాజు(ఐవి రాజు) అన్నారు. గురువారం గణపవరం మండలం పిప్పర శాఖా గ్రంథాలయంలో శ్రీ యోగివేమన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. యోగివేమన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. శాఖ గ్రంథాలయానికి పిప్పర గ్రామానికి చెందిన గుడ్ల సీతారాం (యూఎస్ఏ) ఆయన తల్లితండ్రులు పేరున గ్రంథాలయానికి రూ 10 వేలు శాశ్వత విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది గుడ్ల వెంకటకృష్ణారావు, పమ్మి సత్యనారాయణమూర్తి, గ్రంథాలయ అధికారి పి. రంగారావు, పాఠకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పింఛనుదారులు ఫిబ్రవరి 28 లోపు వార్షిక ధృవీకరణ పత్రాలు సమర్పించాలి

విశాలాంధ్ర - ఏలూరు : ట్రెజరీ కార్యాలయాల ద్వారా సర్వీస్ పెన్షన్, కుటుంబ పెన్షన్ పొందుతున్న పింఛను దారులు అందరూ తప్పనిసరిగా జనవరి 1 నుండి ఫిబ్రవరి 28 వరకు వార్షిక ధృవీకరణ పత్రాలు జీవన్ ప్రమాన్ పోర్టల్ ద్వారా సమర్పించాలని ఏలూరు జిల్లా ఖజానా, లెక్కల శాఖాధికారి, టి. కృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆ వార్షిక ధృవీకరణ పత్రాలు సమర్పణ కు తప్పనిసరిగా వారి పింఛను పొందుతున్న సబ్ ట్రెజరీ కార్యాలయానికే వెళ్ళ వలసిన అవసరం లేదని, వారికి దగ్గరగా ఉన్న ట్రెజరీ కార్యాలయాన్ని, మీ సేవా కేంద్రాలు, బ్యాంకులు,ఇతర సర్వీస్ సెంటర్లలో వేయవచ్చని, సొంతంగా బయోమెట్రిక్ డివైజ్‌లు కలిగిన వారు వారి ఫోన్, కంప్యూటర్ ద్వారా కూడా వేయవచ్చని తెలిపారు. ఎవరికైనా జీవన్ ప్రమాన్ పోర్టల్ లో నమోదు చేయడంలో ఇబ్బందులు ఉన్నా, అనారోగ్య కారణాల చేత బయటకు రాలేక పోయినా సంబంధిత ట్రెజరీ అధికారుల దృష్టికి తీసుకువెళితే వారు తగుచర్యలు తీసుకుంటారని తెలిపారు.ఈ విషయం లో జిల్లా నందలి సహాయ ఖజానా అధికారులు, ఉప ఖజానా అధికారులందరికి శనివారం సమావేశం నిర్వహించి తగు సూచనలు జారీ చేశారు.

మాంటిస్సోరి పాఠశాలలో వార్షిక క్రీడోత్సవాలు

విశాలాంధ్ర- తణుకు : స్థానిక మాంటిస్సోరి స్కూలులో గురువారం 34వ వార్షిక క్రీడోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు పాఠశాల పతాకావిష్కరణ గావించి జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి ఒక్కరు ఈ క్రీడల్లో పాల్గొని గెలుపు ఓటములను సమదృష్టితో స్వీకరించాలన్నారు. నేటి ఓటమి రేపటి విజయానికి తొలిమెట్టు అని అన్నారు. క్రీడల వలన విద్యార్థులలో శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం, చక్కని ఆరోగ్యం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానఉపాధ్యాయిని ఎం. లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కైకరం హైస్కూలును సందర్శించిన ఉప విద్యాశాఖ అధికారి

విశాలాంధ్ర-ఉంగుటూరు: కైకరం హైస్కూలను తాడేపల్లిగూడెం డివిజన్ ఉపవిద్యాశాఖా అధికారిణి ఎన్. రవీంద్ర భారతి గురువారం సందర్శించారు. పాఠశాలలో పరీక్షల సందర్భంగా దిద్దిన జవాబు పత్రాలను సబ్జెక్టుల వారీగా పరిశీలించి, తగు సూచనలు చేశారు. ఎస్ఏ -1 పరీక్షలలో తరగతి ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. 6 నుంచి పదవ తరగతి వరకూ వెనుక బడిన విద్యార్థులకు రెమిడీయల్ తరగతులు నిర్వహించాలని తెలిపారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారని హెచ్ఎం శ్రీనివాస్ కుమార్ తెలిపారు.

యోగి వేమన జయంతి వేడుకలు

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు మండలం ఉప్పాక పాడులో యోగి వేమన జయంతి ప్రధానోపాధ్యాయులు అల్లు శ్రీను ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. తొలుత వేమన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అల్లు శ్రీను మాట్లాడుతూ మనం యోగి వేమన రచించిన పద్యాలు సమాజానికి ఆదర్శం, అనుసరించదగినవి అని చెప్పారు. ఉపాధ్యాయులు పి.శ్రీదేవి, శాంసన్ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థుల చేత వేమన పద్యాలు చెప్పించారు.

యోగి వేమన జయంతి వేడుకలు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : స్థానిక శాఖగ్రంథాలయం వద్ద యోగివేమన జయంతిని విద్యార్థుల మధ్య ఘనంగా నిర్వహించారు. ముందుగా యోగి వేమన చిత్రపటానికి గ్రంథ పాలకు రాలు యు. రాముడు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వేమన రచించిన తెలుగు పద్యాల విశిష్టతను ,ఆయన నిరాడంబరతను విద్యార్థులకు రాముడు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీరు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - గణపవరం : ఉంగుటూరు నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోనూ మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఉంగుటూరు జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్ చార్జి పచ్చమట్ల ధర్మరాజు అన్నారు. గురువారం గణపవరం మండలం డి కుముదువల్లి గ్రామంలో 10 వరోజు జనంలోకి జనసేన కార్యక్రమం నిర్వహించి, పెద్దలను కలిసి ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు.డి కుముదువల్లి గ్రామంలో ప్రజలు త్రాగునీరు, డ్రైనేజీ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని వివరించారు. ప్రజాసమస్యలు పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి గంగుమోలు చిన్న రత్తయ్య, గ్రామ అధ్యక్షులు బండి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు నార్ల పెద్ద సత్యం, దాసం సూర్య ధనరాజు,తోట పవన్, దాసం వెంకట కుమార్, దశం రాము, ముద్రగడ్డ పాపయ్య,వడ్డీ వెంకట్, యాలబండి సాయి, కొల్లేపల్లి దుర్గాప్రసాద్, కాసాని నరసింహమూర్తి, గ్రామ జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం అమ్మకాలను సమీప మిల్లర్లకు ఇవ్వాలి

విశాలాంధ్ర- నూజివీడు టౌన్ : మండల పరిధిలో రైతాంగం తమ ధాన్యాన్ని అమ్ముకునేందుకు సమీప మిల్లర్లకు అమ్ముకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని నూజివీడు ఎంపీపీ ఆరేపల్లి శిరీష సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నూజివీడు మండలం పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ అన్ని శాఖల అధికారులు తో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలో రైతాంగం తమ ధాన్యాన్ని అమ్ముకునేందుకు సమీప మిల్లర్లకు అవకాశం ఇవ్వాలన్నారు. సుదీర ప్రాంతాలకు తీసుకుని వెళ్లి అమ్మాలంటే చిన్న, సన్నగా రైతులకు వ్యయ ప్రయాసవుతుందన్నారు. కాబట్టి ఉన్నతాధికారులు ఈ సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించలన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు మంజూరైన ట్రాన్స్ఫార్లను బిగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జడ్పీ వైస్ చైర్మన్ జి. కృష్ణంరాజు , వైస్ ఎంపీపీ దండి బోయిన స్వర్ణలత, ఎంపీడీవో ఎంపిఎన్ సుందరి , సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వేమన పద్యాలు జీవిత సత్యాలు

విశాలాంధ్ర - భీమవరం : వేమన పద్యాలు జీవిత సత్యాలు అని,సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో అత్యంత సులభంగా తేలికైన పదజాలంతో రచించిన వేమన పద్యాలు అన్ని తరాల ప్రజలు అంగీకరించడం ఆయన రచనల గొప్పతనం అని జిల్లా కలెక్టరు పి. ప్రశాంతి అన్నారు .గురువారం జిల్లా కలెక్టరు క్యాంపు కార్యాలయంలో యోగివేమన జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యోగివేమన చిత్రపటానికి ముందుగా పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు .ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆటవెలది చందంలోనే పద్యాలను రచించి లోతైన భావాన్ని కూడా సరళమైన భాషలో చక్కటి ఉదాహరణలతో హృదయానికి అత్తుకునేలా వేమన తన భావాన్ని ప్రజలకు చెప్పారని ఆమె కీర్తించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు యోగి వేమన జయంతి వేడుకలను నిర్వహిచడం జరుగుతుందని జిల్లా కలెక్టరు అన్నారు. ఎప్పుడు ఈ కార్యక్రమం నిర్వహించిన వేదికపై ఉన్నవారు మాట్లాడితే ఎదురుగా ఉన్నవారు అందరూ ప్రేక్షకులుగా మాత్రమే ఉండేవారని కాని ఈ జయంతి ఉత్సవ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు అయ్యారన్నారు. వేమన విగ్రహారాధనకు, కులాలకు, మతాలకు అతీతమని అయన అన్ని వర్గాలకు చెందిన వ్యక్తి అని ఆమె కొనియాడారు. ఆయన పద్యాలతో జీవిత సత్యాలను ప్రజలకు తెలియజేశారని, తెలుగు భాష గొప్పదనాన్ని ప్రపంచానికి చాటిచెప్పారని ఆమె కీర్తించారు. ఆయన రచించిన ఎన్నో పద్యాలు నేటి ఆధునిక యుగంలో చేపడుతున్న పరిశోధనలకు ఆధారంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లా జాయింటు కలెక్టరు జెవి మురళి మాట్లాడుతూ యోగివేమన ప్రజాకవి అని, పామరులు , పండితులను అలరించిన ఆయన కవిత్వం ఎంతో గొప్పదని ఆయన అన్నారు. యోగి వేమన జన్మదిన వేడుకల్లో , జిల్లా రెవెన్యూ అధికారి దాసిరాజు , జిల్లా విద్యాశాఖ శాఖ అధికారి ఆర్. వెంకట రమణ, జిల్లా బి సి సంక్షేమ శాఖ అధికారి గణపతి రావు , జిల్లా అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఖాళీ స్థలాలు లీజు

విశాలాంధ్ర -భీమవరం: విజయవాడ జోన్ పరిధిలో ఖాళీగా ఉన్న ఆర్టీసీ స్థలాలను 15 ఏళ్ల లీజు ప్రాతిపదికన ఇవ్వడానికి ఫ్రీబిడ్ ఆహ్వానిస్తున్నట్లు పశ్చిమగోదావరి జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి ఎ.వీరయ్యచౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. తునిలో 2, కాకినాడలో 1, పెద్దాపురంలో 1, సామర్లకోటలో1, అంబాజీపేటలో1, రంగంపేటలో1, ద్వారకాతిరుమలలో 1, ఏలూరులో 3, తాడేపల్లిగూడెంలో 2, మార్టేరులో 2, చల్లపల్లిలో 3, కూచిపూడిలో 1, మోపిదేవిలో 1, మచిలీపట్నంలో 1, మైలవరం లో 1, నందిగామలో 2, జగ్గంపేటలో 4 ఖాళీ స్థలాలు ఉన్నాయని వీటికి సంబంధించి శుక్రవారం విజయవాడ ఆర్టీసీ హౌస్, పిఎస్బిఎస్ వద్ద మధ్యాహ్నం 3 గం"లకు ఫ్రీబిడ్ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు ఆసక్తి కలిగిన వారు కాన్ఫరెన్స్ లో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పాలడుగుకు ఘన నివాళులు

విశాలాంధ్ర - నూజివీడు టౌన్ : మాజీమంత్రి ,కాంగ్రెస్ పార్టీ దివంగత నాయకులు పాలడుగు వెంకటరావు 8వ వర్ధంతి పురస్కరించుకుని స్థానిక కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ నాయకులు గురువారం సంతాప సభ నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు, పాలడుగు సేవలను కొనియాడారు . ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ బీడీ రవికుమార్, మాజీ జెడ్పిటిసి సభ్యులు సుంకర సుభాష్ చంద్రబోస్, కాంగ్రెస్, పీసీసీ సభ్యులు విటల్, జిల్లా ఉపాధ్యక్షులు పరిమిసాగర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా గృహ నిర్మాణాలు

విశాలాంధ్ర -భీమవరం టౌన్: నియోజకవర్గంలో మొదటి విడతగా జరుగుతున్న గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ హౌసింగ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో హౌసింగ్ డిఇ బి. వెంకటరమణతో ప్రస్తుతం నియోజకవర్గంలో జరుగుతున్న గృహ నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సహకారంతో నియోజకవర్గంలో సుమారుగా 14 వేల మందికి పైగానే ఇళ్ల స్థలాలను మంజూరు చేసి, పట్టాలను కూడా ఇచ్చినట్టు తెలిపారు. ఒక్కో గృహ నిర్మాణానికి ప్రభుత్వం రూ.లక్ష 80 వేల నిధులను ఉచితంగా మంజూరు చేయడంతో పాటుగా లబ్ధిదారుల ఇష్టం మేరకు 30 వేల వరకు బ్యాంకు రుణాలను కూడా అందించడం జరుగుతుందని అన్నారు. కాలనీలలో అంతర్గత రోడ్లను కూడా నిర్మించనున్నట్టు తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. గృహ నిర్మాణాలపై రోజువారి పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకోనున్నామన్నారు.

పరంపర స్కీమ్‌లో అక్రమాలు నిగ్గు తేల్చాలి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : ఆంధ్రప్రదేశ్ పేపర్ మిల్లులో పరంపర టు పేరుతో సాగుతున్న అక్రమాల నిగ్గు తేల్చాలని టీడీపీ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి వాసు డిమాండ్ చేసారు. పారదర్శకంగా జరగాల్సిన నియామకాలు అక్రమాలకు నిలయంగా మారడం శోచనీయమన్నారు. స్వేదం చిందించి పరిశ్రమ అభివృద్ధికి తోడ్పడే కార్మికులను మోసం చేయాలనుకోవడం, వారిచేత కన్నీళ్లు పెట్టించడం దారుణాతి దారుణమని అన్నారు. సాక్షాత్తు అధికార వైసిపి ఎమ్మెల్యే, తూర్పు గోదావరి జిల్లా వైసిపి అధ్యక్షుడు అయిన జక్కంపూడి రాజా ఇప్పటికే కార్మికులకు జరిగిన అన్యాయం గురించి కలెక్టర్ కి ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. అటువంటి వ్యక్తిపై ఇంతవరకూ చర్యలు ఎందుకు తీసుకోలేదని ఆదిరెడ్డి వాసు ప్రశ్నించారు. మరోపక్క ప్రవీణ్ చౌదరిని వైసిపిలో చేర్చుకుని సీఎం కి తరచూ పరిచయం చేస్తున్న ఎంపీ భరత్ దీనికి ఏం సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు. తెలుగు మహిళ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షురాలు ద్వారా పార్వతి సుందరి, టిడిపి రాజమండ్రి పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షులు మజ్జి రాంబాబు, బీసీ సాధికార సమితి శెట్టిబలిజ విభాగం రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు, టిఎన్టీయూసీ రాష్ట్ర కార్యదర్శి తీడా నరసింహారావు, రాజమండ్రి పార్లమెంట్ కమిటీ అధ్యక్షులు యర్రమోతు ధర్మరాజు, ప్రధాన కార్యదర్శి యాళ్ల శ్రీను, మాజీ కార్పొరేటర్లు కడలి రామకృష్ణ, పాలవలస వీరభద్రం, నాయకులు మిస్కా జోగినాయుడు, టిఎన్టియూసీ అధికార ప్రతినిధి మల్లెల శ్రీనివాస్, పేపరు మిల్లు టిఎన్టియూసీ నాయకులు ఎం సుబ్బారావు, చైతన్య కార్మిక సంఘం నాయకులు ఎల్ అప్పారావు, జిల్లా టిఎన్టియూసీ నాయకులు ఎన్. రమణారావు, పీవీ ప్రసాద్, లచ్చిరెడ్డి వాసు, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు సాయి దీపక్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్య వెలుగు రేఖ యోగి వేమన

విశాలాంధ్ర - ఆలమూరు : విశ్వదాభిరామ వినురవేమ అనే మాట వినని తెలుగువారు ఉండరేమో. వానకు తడవని వారు, వేమన పద్యం రాని తెలుగువారు ఉండరని పామరులకు కూడా అర్థమయ్యే భాషలో పద్యాలు

చెప్పి ప్రజలను మెప్పించిన కవి, మట్టిలో పుట్టి మహోన్నతమైన శిఖరాలను అందుకున్న మానవతామూర్తి యోగి వేమనని, ఆయన తెలుగు సాహిత్య వెలుగు రేఖగా కొత్తపేట నియోజకవర్గం ఆలమూరు మండలం జొన్నాడ గ్రామ మాజీ సర్పంచ్ ద్వారంపూడి అప్పారెడ్డి అభివర్ణించారు. వేమన జయంతి సందర్భంగా జొన్నాడ మల్లేశ్వర స్వామి వారి ఆలయం వద్ద గల యోగి వేమన శిలా విగ్రహానికి వేమన రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ సమాజంలోని మంచి చెడుల్ని, జీవిత సత్యాలను వేమన తెలియజేశారని, మానవ జీవిత సత్యాఅసత్యాలను నిత్యాన్వేషణతో దర్శించి విమర్శించిన వివేకిగా వేమన కీర్తిగడించారని అన్నారు. ఈ కార్యక్రమంలో నల్లమిల్లి రామారెడ్డి, తాడి తమ్మిరెడ్డి, మేడపాటి రామారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, తాడి శ్రీనివాస రెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ నాద్ర నాగ మోహన్ రెడ్డి, సొసైటీ బ్యాంక్ చైర్మన్ తాడి మెహెర్ ఆదిత్య రెడ్డి, తాడి వెంకన్నబాబు, తాడి శ్రీనివాస్ రెడ్డి(బట్టిశ్రీను), సర్పంచ్ కట్టా శ్రీనివాసు, మేడపాటి వెంకట కృష్ణారెడ్డి, మల్లిడి సుబ్బిరెడ్డి పలువురు పాల్గొన్నారు.

వరుణ్ తేజ్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - మండపేట : మెగా బ్రదర్ నాగబాబు తనయుడు, ప్రముఖ

సినీ హీరో వరుణ్ తేజ్ జన్మదిన వేడుకలు మండపేటలో ఘనంగా జరిగాయి. మండపేట వరుణ్ తేజ్ టౌన్ వైడ్ ఫాన్స్ అధ్యక్షుడు మోరం బాలాజీ ఆధ్వర్యంలో వరుణ్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం వరుణ్ తేజ్ 33వ జన్మదినోత్సవం పురస్కరించుకుని స్థానిక మయూరి వృద్ధాశ్రమంలో అల్పాహార విందు, పండ్లు పంపిణీ చేశారు. ఆశ్రమంలోని వృద్ధుల మధ్య కేక్ కట్ చేసి వారికి పంచారు. కార్యక్రమానికి మెగా ఫ్యామిలీ పట్టణ అధ్యక్షుడు కొంతం నాగేంద్ర ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మెగా ఫ్యామిలీ అభిమానులు సేవా కార్యక్రమాల్లో ముందుంటా రన్నారు. బాలు మాట్లాడుతూ వరుణ్ మంచి భవిష్యత్ ఉన్న హీరో అన్నారు. కార్యక్రమంలో బండారు సతీష్, నరేంద్ర, రాజు,యాళ్ల సురేంద్ర, కొత్తపల్లి వీరతరుణ్, గ్రంధి సునీల్, శివ వరుణ్ అభిమానులు పాల్గొన్నారు.

సమాజానికి బుద్ధుని బోధనలు అవసరం

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : కోరుకొండ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి అతి సమీపంలో ఉన్న ప్రఖ్యాత బౌద్ధ క్షేత్రం పాడవుల మెట్ట ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామని రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. అమరావతి బుద్ధవిహార్ సౌజన్యంతో సద్ధమ్మ దీపిక ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రముఖ బౌద్ధ బిక్షువు బంతే ధామ్మా ధజథేరో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ను గురువారం రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే రాజా ఆవిష్కరించారు. ప్రతీ ఒక్కరూ సన్మార్గంలో నడిచి,సమాజ అభ్యున్నతికి తమవంతు సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కోమలి, తిలక్ కుమార్, రాజానగరం ఎంపీడీవో మూర్తి, శ్రీనివాస్, వైసీపీ నాయకులు కటకం బాబ్జీ, సద్ధమ్మ దీపిక ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

విశ్వదాభిరామ వినురవేమ పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర - తాళ్లపూడి : వేమన పద్యాలు సమాజాన్ని నిర్దేశిస్తాయని, వాటిని నేర్చుకుని సన్మార్గంలో నడవాలని టి టి డి ధర్మ ప్రచారక్ పరస రాధాకృష్ణ తెలిపారు. గురువారం యోగి వేమన జయంతి కార్యక్రమాన్ని శ్రీ విజేత హై స్కూల్‌లో ప్రధానోపాధ్యాయులు డా.జొన్న కూటి ప్రమోద్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

కార్యక్రమంలో ముందుగా పాఠశాల విద్యార్థులు వేమన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వేమన పద్యాల పోటీ నిర్వహించగా జూనియర్స్ విభాగం నుండి జె నాగ మనోజ్ఞ, సీనియర్స్ విభాగం నుండి ఎన్ సురేఖ ప్రథమ స్థానంలో నిలిచారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు డా జొన్నకూటి రచించిన "విశ్వదాభిరామ వినురవేమ" పుస్తకాన్ని పరస రాధాకృష్ణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాత్రికేయులు ఎస్ గోపాల కృష్ణ, కె శ్రీనివాస్, ఉపాధ్యాయలు అనిత, కరుణ, దివ్య తదితరులు పాల్గొన్నారు.

జీ తెలుగులో సరికొత్త కథాంశంతో 'శుభస్య శీఘ్రం'

విశాలాంధ్ర- భీమవరం : ఎప్పటికప్పుడు సరికొత్త కంటెంట్‌తో భిన్నమైన సీరియల్స్‌తో తెలుగు ప్రేక్షకులను అలరిస్తున్న 'జీ తెలుగు'. ఛానల్ కొత్తదనం నిండిన కామెడీ, డాన్స్, సింగింగ్ షోలు, ఆసక్తికర మలుపులతో సాగుతున్న సీరియల్స్ టెలివిజన్ రంగంలో దూసుకుపోతోందని ఆ ఛానల్ ప్రాంతీయ ప్రతినిధి చెప్పారు. అదే ఉత్సాహంతో నూతన సంవత్సర సంక్రాంతి కానుకగా ఇప్పుడు 'శుభస్య శీఘ్రం' అంటూ మరో కొత్త సీరియల్‌తో ప్రేక్షకుల ముందుకి రాబోతోందన్నారు. ఇది ఆర్థిక అసమానతలు, ఆత్మాభిమానం మధ్య జరిగే సంఘర్షణగా తెరకెక్కుతున్న ప్రేమకథ అన్నారు. మహేష్ బాబు- కృష్ణప్రియ ప్రధాన పాత్రలలో నటించిన 'శుభస్య శీఘ్రం' ఈ నెల 23 నుంచి ప్రతిరోజూ రాత్రి 7 గంటలకు ప్రసారం కానుందని చెప్పారు.

ఫ్లిప్‌కార్ట్ రిపబ్లిక్ డే స్పెషల్

విశాలాంధ్ర-రాజమండ్రి: స్వదేశీ ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ డిజిటల్ బీ2బీ మార్కెట్ ప్లేస్ ఫ్లిప్‌కార్ట్ హోల్‌సేల్ దాని సభ్యుల కోసం రిపబ్లిక్ డే స్పెషల్‌ను ప్రారంభించింది. 'మునాఫ్ కీ పెరేడ్' అనే థీమ్‌తో, ఆఫర్ వ్యవధిలో విస్తృతమైన ఉత్పత్తుల ఎంపికపై మునుపెన్నడూ చూడని డీల్‌లతో సభ్యుల లాభాలు, పొదుపులను పెంచాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈవెంట్ జనవరి 19 - 26, 2023 నుండి ఫ్లిప్‌కార్ట్ హోల్‌సేల్ ఫిజికల్ స్టోర్‌లు, ఆన్‌లైన్ ఛానెల్‌లలో ప్రత్యక్ష ప్రసారమవుతుంది. అధిక లాభాలు, మరింత పొదుపులను అందించడంపై దృష్టి సారించి ఈ జాతీయ మెగా ఈవెంట్ వివిధ ఆకర్షణీయమైన ఆఫర్‌లు, డీల్‌లతో నిర్వహించబడిరది. ఇందులో '74 రిపబ్లిక్ డీల్స్', 'బ్రాండ్ బిల్ బస్టర్స్', మరిన్నింటిని వాక్-ఇన్, ఆన్‌లైన్ సభ్యుల కోసం ప్రత్యేకంగా రూపొందించినట్లు ఫ్లిప్‌కార్ట్ హోల్‌సేల్ బిజినెస్ హెడ్ కోటేశ్వర్ ఎల్ ఎన్ తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన పడాల

విశాలాంధ్ర - అనపర్తి : ఇటీవల నూతనంగా నియమితులైన అనపర్తి మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి గురువారం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్య నారాయణ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకే అందజేసి నియామకానికి సహకరించిన సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పడాల స్థానిక వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ సందర్శించారు. ల్యాబ్లో పరీక్షించబడుతున్న విత్తనాలు, ఎరువుల నమూనాల క్వాలిటీ పరీక్ష విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ ప్రదేశాల నుంచి వచ్చిన విత్తనాలు, ఎరువుల శాంపిల్స్ ఇక్కడ పరిశీలించి నివేదిక సమర్పిస్తామని వ్యవసాయ అధికారిని వాణి తెలిపారు. అనంతరం శ్రీనివాసరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌గా నియామకానికి కృషి చేసిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - దేవరపల్లి : దేవరపల్లి శ్రీ చైతన్య స్కూల్లో గురువారం స్కూల్ విద్యార్థులు సి 6బ్యాచ్ విద్యార్థులు ఆల్ ఇండియా స్థాయిలో జరిగిన కాట్ లెవెల్ సెకండ్ పరీక్షల్లో 11 మంది విద్యార్థులు స్వర్ణ పతకాలు సాధించినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ ఎ. సురేఖ తెలిపారు. ముగ్గురు విద్యార్థులు ఎన్. సాయిబాబా, కె. జశింత్, ఐ. సోనిత్ కు స్వర్ణ పతకాలతో పాటు నగదు బహుమతులు కూడా గెలుచుకున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను గురువారం పాఠశాలలో స్కూల్ ప్రిన్సిపాల్ ఎ. సురేఖ, ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, ఏవో భరత్, సత్యసాయి, ఉపాధ్యాయులు, అభినందించారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయండి

విశాలాంధ్ర - అంబాజీపేట : కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని మండపేట ఇన్‌చార్జి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కామన ప్రభాకర్ రావు అన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు ములపర్తి మోహన్ రావు స్వగృహంలో గురువారం విలేకరుల సమావేశంలో ఏఐసీసీ నాయకులు మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు కామన ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ఈదేశానికీ కాంగ్రెస్ పార్టీయే రక్షణ అని బీజేపీ ఈ దేశాన్ని కులాలుగా, మతాలుగా విభజించి ఫలించాలని అనుకొంటుందని ఇది దేశానికీ మంచిది కాదని అన్నారు. 137 సంవత్సరాలు చరిత్ర ఉన్న పార్టీ కాంగ్రెస్ అన్నారు. బీజేపీ, రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనలో రైతులు, నిరుద్యోగులు, చిన్న వ్యాపారస్తులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. ప్రజల కోసం పోరాడే ఏకైక పార్టీ కాంగ్రెస్ అన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు నెల్లి వెంకటరమణ, మాచవరపు శివన్నారాయణ, అమలాపురం ఇన్చార్జ్ అయితాబత్తుల సుభాషిని, సిహెచ్ జోగేశ్వరరావు, కోలా అర్జున్ రావు, అప్పల రామకృష్ణ, కొల్లి సరోజిని, గద్దం వెంకటేశ్వరరావు, దిపాటి సత్తిబాబు, బాలయోగి తదితరులు పాల్గొన్నారు.

8వ డివిజన్‌లో గడపగడపకు ప్రభుత్వం

విశాలాంధ్ర - కాకినాడ : కౌడా చైర్ పర్సన్, వైయస్సార్సీపీ నగర అధ్యక్షురాలు, కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి గురువారం 8వ డివిజన్లో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. సాంబ మూర్తి నగర్ ప్రాంతంలో ఇంటింటికి వెళ్ళి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మూడున్న రేళ్ళ ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందించిన లబ్ధిని వివరించారు. కౌడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి కుమార్, వైఎస్సార్సీపీ కాకినాడ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్నసాగర్, పలువురు మాజీ కార్పొరేటర్లు, అధికారులు ఆయన వెంట ఉన్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సత్వరమే పరిష్కరించాల్సిందిగా అక్కడే ఉన్న అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సహకారంతో కాకినాడ నగరాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బెండ విష్ణుమూర్తి, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, ఎంహెచ్ఓ డాక్టర్ పృధ్వి చరణ్, మాజీ కార్పొరేటర్లు నల్లబెల్లి సుజాత, కర్రీ శైలజ, చిట్నీడి నారాయణమూర్తి, వైఎస్ఆర్సిపి నాయకులు బళ్ళ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కేసీబీఎస్‌లో ఉచిత దంతవైద్య శిబిరం

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ బిల్డింగ్ సొసైటీ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం సంఘ ప్రధాన కార్యాలయంలో సభ్యులకు ఉచిత దంతవైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సంఘాధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

కార్యక్రమంలో తొలుత సంఘ పూర్వాధ్యక్షుడు దివంగత కోసూరి కృష్ణారావు, కోసూరి యదుసూర్య చిత్రపటాలకు పుష్పమాలవేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా కోసూరి మాట్లాడుతూ సంఘ సభ్యుల క్షేమమే సంక్షేమంగా భావిస్తూ పలురంగాల్లో నిష్ణాతులైన వైద్యులతో శిబిరాలను నిర్వహిస్తున్నామని, వాటిని వినియోగించుకోవాలని కోరారు. ఈ దంతవైద్య శిబిరంలో గుంటూరుకు చెందిన శ్రీధన్వి డెంటల్ క్లినిక్ వైద్యురాలు సీహెచ్ఎస్వీఎల్ స్రవంతి, కాకినాడ సమీక్ష దంతవైద్యశాల వైద్యుడు సువర్ణరాజు పాల్గొని దంతపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీచేశారు. కార్యక్రమంలో కేసీబీఎస్ ఉపాధ్యక్షుడు రెడ్డి వీరరాజేంద్రకుమార్, కార్యదర్శి ముమ్మిడి గోవిందు, డైరెక్టర్లు ముమ్మిడి వెంకటరమణ, ముత్తా మధు, ఒబిలిశెట్టి బుచ్చిరాజు, శివబాలయోగి, కోసూరి లక్ష్మీప్రసాద లావణ్య, మేనేజర్ చీమలకొండ గంగాధరం తదితరులు పాల్గొన్నారు.